క్లుప్తంగా

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న ఆనంద్‌కుమార్



అమ్మవారి సన్నిధిలో ఆనంద్ కుమార్ తదితరులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు గవరవీధిలో ఏర్పాటు చేసిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను శనివారం వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆనంద్ కుమార్‌కు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు నాయకులు నమ్మి శ్రీను, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం ఎస్తేర్ హెప్సిబా

గోపాలపట్నం: పిల్లల చదువు, వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి, ఆరాతీయాలని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సూచించారు. గోపాలపట్నం బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో హెచ్‌ఎం ఎస్తేర్ హెప్సిబా మాట్లాడారు. విద్యార్థులు స్కూల్‌కు ఎన్ని గంటలకు వస్తున్నారు, తిరిగి ఎన్ని గంటలకు ఇంటికి చేరుతున్నారన్న విషయాలను పట్టించుకోవాలన్నారు.

జెడ్పీహైస్కూల్‌లో..

గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ మాట్లాడారు. ఇచ్చిన వర్కులు పూర్తి చేయించే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.

నేడు లేబర్ యూనియన్ సర్వసభ్య సమావేశం

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జీవీఎంసీ 59వ వార్డు పరిధిలోని గోకుల కృష్ణ యాదవ కల్యాణ మండపంలో జరగనుంది. యూనియన్ గౌరవ అధ్యక్షుడు భోగవల్లి నాగభూషణం ఆధ్వర్యంలో జరిగే సర్వసభ్య సమావేశానికి అతిథులుగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి కార్మికులతో పాటు ఇంటక్ కార్యకర్తలు పాల్గొవాలని భోగవల్లి పిలుపునిచ్చారు.

ఆటో బోల్తా



ఘటనలో గాయపడిన వ్యక్తి

మల్కాపురం: ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి స్వల్పగాయాలయ్యాయి. వివరాలు.. డాక్‌యార్డ్ నుంచి సింధియా మీదుగా మల్కాపురం వైపు ఆటో వస్తోంది. మార్గ మధ్యలో సింధియా కాలనీ నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు రోడ్డు దాటే ప్రయత్నం చేస్తుండగా ఆ సమయంలో అటుగా వస్తున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పింది. దీంతో ఆటో బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో ఉన్న ఇద్దరు నేవీ ఉద్యోగులతో పాటు మిగిలిన నలుగురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఆరోగ్యమస్తు!





బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ

యూపీహెచ్‌సీ పరిధిలో

మొత్తం ఇళ్లు **8,680**

సేవలందుకునే మొత్తం జనాభా **26,285**

- అందుబాటులో కార్పొరేట్ వైద్యం
- ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు
- ఉచితంగా ఖరీదైన వైద్య పరీక్షలు
- తల్లీబిడ్డల సంరక్షణలో కీలక పాత్ర
- సకాలంలో వ్యాధి నివారణ టీకాలు
- స్పెషలిస్టు వైద్యులతో ప్రభుత్వాస్పత్రికి పెరిగిన ఆదరణ
- పేద ప్రజలకు అండగా బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ

యూపీహెచ్‌సీ పరిధిలో సచివాలయాలు

సచివాలయం	ఇళ్లు	సేవలు అందుకుంటున్న జనాభా
బుచ్చిరాజుపాలెం -1	1,106	3,550
బుచ్చిరాజుపాలెం -2	1,368	3,628
బుచ్చిరాజుపాలెం-3	1,137	3,408
బుచ్చిరాజుపాలెం -4	1,053	3,225
సుసర్ల కాలనీ -1	1,003	3,086
సుసర్ల కాలనీ -2	965	3,086
బాజీ జంక్షన్	1,016	3,002
కాకాని నగర్	1,032	3,300



గర్భిణికి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ మానస



మందులు రికార్డుల్లో నమోదు చేస్తున్న ఫార్మాసిస్టు



వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన కుర్చీలపై రోగులు

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం 26 వేల మందికి పైగా ప్రజానీకానికి వైద్య భరోసా కల్పిస్తోంది. ప్రతీ రోజూ 70 మందికి పైగా ఇక్కడికి వైద్యం కోసం వస్తున్నారు. సకాలంలో వైద్యం అందించడంతో పాటు అవసరమైన మందులను సైతం ఉచితంగానే అందిస్తున్నారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా తల్లీ–బిడ్డల సంరక్షణలో ఇక్కడి వైద్యులు, సిబ్బంది విశేష కృషి చేస్తున్నారు.

పని వేళలు ఇలా..

బుచ్చిరాజు పాలెం వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రతీ రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుంది. ఇక్కడ డాక్టర్తో పాటు ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, లాస్ట్‌గ్రేడ్ సర్వీసు(అటెండర్) విధులు నిర్వహిస్తున్నారు. రోగులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం అందించే క్రమంలో స్పెషలిస్టు వైద్యులు సైతం ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. స్త్రీ వ్యాధి నిపుణులు, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, చిన్నపిల్లల వైద్య నిపుణులు వారంలో ఒక్కో రోజు ఇక్కడ అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. యూపీహెచ్‌సీ పరిధిలోని ఎనిమిది సచిలయాల్లో ఏఎన్‌ఎంలు ప్రజలకు అందుబాటులో ఉన్నారు.

63 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగానే చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అరకొరగానే వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉండేవి. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 63 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. మలేరియా, డెంగ్యూ, సుగర్ వంటి పరీక్షలతో పాటు, కిడ్నీ సంబంధిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు సైతం చేసేలా అధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

సచివాలయాల స్థాయిలో పర్యవేక్షణ



యూపీహెచ్‌సీకి వచ్చే వారికి సకాలంలో వైద్యం అందించేలా కృషి చేస్తున్నాం. సిబ్బంది బాధ్యతగా పనిచేస్తున్నారు. సచివాలయాల స్థాయిలో వైద్య సేవలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. ఏఎన్‌ఎంల నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు సేకరించి ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. వారి సూచనల మేరకు వైద్య సేవలు మరింత మెరుగ్గా చేస్తున్నాం.

– వరలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్

సేవలు బాగున్నాయి



గర్భవతిగా ఉన్న నాకు వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఏదైనా ఇబ్బంది ఉందని చెబితే వాళ్లే ఇంటికొచ్చి ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. డాక్టర్ బాగా చూశారు. కాన్పు కూడా ప్రభుత్వాస్పత్రిలోనే పోసుకుంటాను. బుచ్చిరాజుపాలెం ఆస్పత్రిలో మంచి సేవలందిస్తున్నారు.

– గౌరుసు అనిత, లక్ష్మీనగర్

మాలాంటోళ్లకు పెద్ద దిక్కు



ప్రభుత్వాస్పత్రిలో గతంలో కంటే వైద్య సేవలు బాగా అందుతున్నాయి. అందుకే ఆస్పత్రికే తరచూ వచ్చి వైద్యం చేయించుకంటాను. నాకు బీపీ తరచూ పెరుగుతుంటుంది. ఇక్కడికి వచ్చి పరీక్షలు చేయించుకుంటాను. అన్ని రకాల పరీక్షలు ఉచితంగానే చేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. మాలాంటి పేదోళ్లకు ఆస్పత్రి పెద్ద దిక్కుగా ఉంది.

– అప్పికొండ సరళ, ఏపీఎస్‌ఈబీ కాలనీ

మరింత బాధ్యత పెంచాయి



ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యం అందించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. బుచ్చిరాజుపాలేనికి చెందిన నేను ఇక్కడే వైద్యురాలిగా పనిచేసే అవకాశం లభించడం ఆనందంగా ఉంది. మా ప్రాంత వాసులకే సేవలు చేస్తున్నందున మరింత బాధ్యతతో వైద్యం చేసేలా కృషి చేస్తాను. ఉన్నతాధికారుల సూచనలు, సలహాలతో అందరినీ సమన్వయం చేసుకొని ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాను.

– డాక్టర్ నమ్మి మానస

సమస్యలు తెలుసుకోవడానికే వచ్చా..

- మీ బాగోగులు చూడాలని జగనన్న పంపారు
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: ప్రతీ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని జగనన్న పంపించారని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు.మీ సంక్షేమం.. బాగోగులే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పని చేస్తున్నారని వివరించారు.

జీవీఎంసీ 91వ వార్డు బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు సంక్షేమ పథకాలు దోహద పడుతున్నాయన్నారు. ఈ పథకాల అమల్లో ఎక్కడా అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయని వివరించారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆనంద్‌కుమార్ కోరారు.

సమస్యల పరిష్కారానికి హామీ

ఈ ప్రాంతంలో సాంతికేతిక కారణాల వల్ల ఇద్దరికి పింఛను రాలేదని.. వారికి తన సొంత నిధులతో పింఛను ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరాభాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు,నాయకులు గేదెల మురళీకృష్ణ, డానియేల్, చుక్క పైడిరాజు రెడ్డి, తాతారావు, కడితి రాజు, నీళ్ల ఈశ్వరరావు, చెంగల హరినాథ్, బల్లంకి ప్రేమ్ కుమార్, ఊటపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు ఆఫీస్ రోడ్డు విస్తరణకు లైన్ క్లియర్

- ఆమోదం తెలిపిన క్యాబినెట్
- సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపిన శ్రీధర్



టవిశాఖ విద్య: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విశాఖ నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ధన్యవాదాలు తెలిపారు. జీవీఎంసీ 52వ వార్డులో ప్రధాన సమస్యగా ఉన్న రోడ్డు విస్తరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని శ్రీధర్ శనివారం వెల్లడించారు. ఎన్‌హెచ్–16లోని పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి కరాస –అరకు బౌడరా రోడ్డుకు అనుసంధానం చేస్తూ నేతాజీ కాలనీ మీదుగా ప్రస్తుతం ఉన్న 30 అడుగుల రోడ్డును 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డుగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన ఏళ్ల తరబడి ఉందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షించదగ్గ విషయమన్నారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ నేతృత్వంలో చేసిన ప్రతిపాదనలతో మూడుదశాబ్దాల ఈ ప్రాంత ప్రజానీకం కల నెరవేరనుందని పేర్కొన్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రులు విడదల రజని , గుడివాడ అమర్‌నాథ్ , ధర్మాన ప్రసాదరావు, నగర పాలక సంస్థ కమిషనర్ సాయికాంత్ వర్మకు శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

యాదవులను బీసీ-బీలో చేర్చాలి



ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: ఆర్థికంగా వెనుకబడిన యాదవులను బీసీ–బీలో చేర్చేందుకు కృషి చేయాలని స్థానిక శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు, సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం వారంతా ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి తమ కార్యవర్గాన్ని పరిచయం చేసుకున్నారు. అనంతరం పశ్చిమ పరిధిలో తమ వర్గానికి అవసరమైన సామాజిక భవనాన్ని ప్రభుత్వం నిర్మించే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. యాదవ సామాజిక వర్గంలో చాలా మంది యువత నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి ఉపాధి కల్పించే విధంగా, బీసీ–డీ సీరియల్ ఉన్న తమను బీసీ–బీ జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆనంద్‌కుమార్ సానుకూలంగా స్పందించారని యాదవ సంఘం ప్రతినిధులు తెలిపారు.

జేసీఎం థర్డ్ లెవెల్ సభ్యుడిగా మారయ్య



గోపాలపట్నం: నేవల్ ఆర్మెంట్ డిపో(ఎన్ఏడీ)లో నేవల్ ఆర్మెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సాలాపు మారయ్యకు జేసీఎం థర్డ్ లెవెల్ సభ్యుడిగా పదవి లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కార్మికుల హక్కుల కోసం చేసిన పోరాటాలే కారణమని తెలిపారు. తమ పోరాటలు గుర్తించిన ఐఎన్‌డీడబ్ల్యూఎఫ్ నాయకులు శ్రీనివాసన్, అశోక్ సింగ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యలపై నిత్యం పోరాడుతానని తెలిపారు.

నేడు జీవీఎంసీ షెల్టర్ వద్ద రక్తదాన శిబిరం

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ వద్ద ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మమత చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఎల్లేటి మమత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. రక్తదాతలు తరలి రావాలన్నారు. పూర్తి వివరాలకు 9701184241 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థి ప్రతిభ



ప్రశాంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్

గోపాలపట్నం: ఆల్ ఇండియా అంతర విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న ప్రశాంత్ ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ప్రశాంత్‌ను అభినందించారు. ఈ నెల 9 నుంచి 12 వరకు రాజమండ్రి ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో సౌత్ వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపి ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారాజు, ఫిజికల్ డైరెక్టర్ కుమార్, ఎస్. కుసురాజ్, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

మల్కాపురం పీఎస్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్

మల్కాపురం: మల్కాపురం పోలీస్ స్టేషన్ సీఐ దేవుడుబాబు తన సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై మల్కాపురం, శ్రీహరిపురం, సింధియా తదితర ప్రాంతాల్లో తిరిగి ఆ సమయంలో రోడ్లపై గుంపులు గుంపులుగా ఉన్న వారిని ప్రశ్నించారు. ఆరుబయట మద్యం తాగిన వారిపై చర్యలు చేపట్టారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన

గోపాలపట్నం: ఓటింగ్ యంత్రాలపై అపోహలు వీడాలని, ఓటు వేసే విధానాన్ని అందరూ తెలుసుకోవాలని గోపాలపట్నం ఆర్ఐ సురేష్ కుమార్ తెలిపారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించారు. ఓటింగ్ ఎలా వేయాలి..వేసిన ఓటు అనుకున్న వ్యక్తికి పడిందా లేదా అని చూసుకోవచ్చని వివరించారు. వీవీప్యాడ్‌లో వేసిన ఓటు మరో యంత్రంలో కనిపిస్తుందని తెలిపారు. అయిది ఇది 5 సెకెన్లు మాత్రమే ఉంటుందన్నారు. నమూనా యంత్రాలతో ఇక్కడి వారికి ఓటు వేయించి చూపించారు. కార్యక్రమంలో వీఆర్ఓ సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్
- పాఠశాలల్లో విద్యా భోదన, సదుపాయాల పరిశీలన



గాంధీగ్రామ్ హైస్కూల్‌లో విద్యార్థినిని ప్రశ్నలు అడుగుతున్న ప్రవీణ్ ప్రకాష్



ములగాడ పాఠశాలలో విద్యారులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

సింధియా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యావిధానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేయాలని ఏపీ విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. విద్యార్థులపై భోదనా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్షమించేది లేదని హెచ్చరించారు. షిప్‌యార్డ్ కాలనీలోని గాంధీగ్రామ్ హైస్కూల్‌ను శనివారం ఆయన సందర్శించి.. పేరెంట్స్ కమిటీ మీటింగ్‌కు హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇంగ్లిష్ మీడియం విద్యార్థులతో మాట్లాడి మ్యాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్ట్‌లపై ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు ఇచ్చే ఆహారాన్ని రుచి చూశారు. ప్రతి రోజూ రుచికరమైన పౌష్టికాహారాన్ని పిల్లలకు అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, డీఈవో చంద్రకళ, డిప్యూటీ డీఈవో, ములగాడ మండల ఎంఈవో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ముచ్చట్లు

మల్కాపురం: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం 58వ వార్డు ములగాడ విలేజ్‌లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల బోధన ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను వారు చదువుతున్న పుస్తకాల నుంచి పలు ప్రశ్నలను అడిగారు. అనంతరం రికార్డులు, తరగతి గదులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు పరిశీలించారు. పాఠశాలలోని ఓ గదిని పనికిరాని సామగ్రితో నింపి స్టోర్ రూమ్‌గా మార్చడంపై ప్రవీణ్ ప్రకాష్ మండిపడ్డారు. ఈ రూమ్‌ను తరగతి గదిగా లేదా ప్రధానోపాధ్యాయులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముచ్చటించి, వారితో సెల్ఫీ తీసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం



గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం వేణుగోపాల్

విశాఖ విద్య: పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు 'పాఠశాలల్లో విద్యార్థులకు చేపట్టాల్సిన భద్రతా ప్రమాణాలు–సైబర్ సెక్యూరిటీ అంశాలు' పై జిల్లా స్థాయి వర్క్ షాప్ శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. గాజువాక ఎంఈవో సునీత అధ్యక్షతన జరిగిన సదస్సులో గొండు సీతారాం మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతా ప్రమాణాలు పాటించేందుకు ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్యాలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. తాగునీరు మొదలు కొని మరుగు దొడ్లు, లైంగిక వేధింపుతో పాటు స్కూల్ బస్ డ్రైవర్లు, కండక్టర్లపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేకంగా ఫిర్యాదుల పెట్టెలు పాఠశాలల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీఈఆర్టీ చైల్డ్ సేఫ్టీ రాష్ట్ర నోడల్ అధికారి ఎం.సోమశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం, భద్రతా ప్రమాణాల్లో భాగంగా వివిధ రకాల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నిహారిక, సీనియర్ లెక్చరర్ రవి పాల్గొన్నారు.